క్లుప్తంగా

నేత్ర వైద్య శిబిరం విజయవంతం



రోగులకు కంటి పరీక్షలు

సాలూరు: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో శనివారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో 75 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో నలుగురుకు కేటరాక్ట్ ఆపరేషన్, ఒకరికి రెటినా సమస్యలున్నట్టు గుర్తించారు. శిబిరంలో డిపో మేనేజర్ భాస్కర రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ కరుణశ్రీ తదితరులు తమ వంతు సేవలందించారు.

కేజీబీవీలో ఆరోగ్య పరీక్షలు



విద్యార్థినిలతో మాట్లాడుతున్న డాక్టర్ పావనీ

సీతానగరం: మండలంలోని జోగింపేట మహిళా కేజీబీవీ విద్యాలయంలో విద్యార్థినిలు ప్రభుత్వం సమకూర్చిన పౌష్టికాహారాన్ని సకాలంలో తీసుకుని నిష్ణాతులైన విద్యా వంతులు కావాలని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ పావని కోరారు. శనివారం జోగింపేట బాలికల కెజీబీవీలో ప్రిన్సిపాల్ జె.సంధ్య పర్యవేక్షణలో విద్యార్థినిలకు డాక్టర్ పావనీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో 200 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సీహెచ్ ఓం ఎస్వీ రమణ, హెల్త్ సూపరువైజరు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన ఎస్‌ఈ

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎస్‌ఇ లక్ష్మణరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సబ్‌స్టేషన్ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. లాగ్‌బుక్‌ల నిర్వహణను పరిశీలించారు. సబ్‌స్టేషన్ పరిధిలో బ్రేక్‌డౌన్ సమయంలో వెంటనే స్పందించాలని సూచించారు. పనులు చేసేటప్పుడు భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. లోడు రికార్డు చూసుకోవాలని సూచించారు. ఎల్‌సీ ఆన్‌లైన్ యాప్ అందుబాటులో ఉందని వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఈ కిషోర్, ఏడీ రంగారావు ఉన్నారు.

విద్యుత్ సమస్యలపై దృష్టి సారించాలి

పార్వతీపురం టౌన్: విద్యుత్ సమస్యలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఎలక్ట్రికల్ ఏడీఈ వెంకటరమణకు సూచించారు. ఇటీవల ఏడీఈగా బాధ్యతలు చేపట్టిన వెంకటరమణ శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా పార్వతీపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఎటువంటి సమస్యలు లేకుండా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరా చేపట్టాలని ఆయన సూచించారు.

పంట సాగుపై అవగాహన అవసరం

మక్కువ: పంట సాగుపై రైతులు అవగాహన కలిగి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి బొత్స శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని డి. సిర్లం గ్రామం రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రైతులందరూ కలిసి ఫార్మర్ ఇంట్రెస్ట్ గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతులందరికీ డ్రమ్సీడు పద్ధతి, మొక్కజొన్న సాగుపై అవగాహనపై గ్రూప్‌లో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ శాతాన్ని పెంచాలి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ కేశవనాయుడు

పార్వతీపురం: జిల్లాలో పోలింగ్ 80 శాతానికి పెంచే లక్ష్యంగా ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ స్వీప్ కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు సూచించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో స్వీప్ కార్యక్రమం రాయబారులకు శనివారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్‌లో చైతన్యం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకొనేలా ప్రజా చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాలలో స్వీప్ కార్యక్రమాలు అమలుకు కార్యాచరణ సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. స్వీప్ జిల్లా నోడల్ అధికారి ఎ.రాజశేఖరరెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా 'మామిడిపల్లి'



మామిడిపల్లిలో హైస్కూల్ భవనం

ఇదిగిదా.. అభివృద్ధి

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామం సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సహకారంతో సర్పంచ్ శశికళ కృషితో గ్రామం సర్వతోముఖాభివృద్ధి చెందింది. గ్రామంలో ఇంచుమించు ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాయి. పంచాయతీలో జరిగిన అభివృద్ధికి గ్రామంలో జరిగిన జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాన్ని ఉదాహరణగా చెప్పొచ్చు. అమ్మ ఒడి పథకం నుంచి కల్యాణమస్తు పథకం వరకు అర్హులైన వారందరికీ రూ.21కోట్ల 66 లక్షల 22 వేల 53లు ఐదేళ్లలో అందాయి. గ్రామంలో పాఠశాల అభివృద్ధికి నాడు – నేడు పనుల కింద రూ.46 లక్షలతో అభివృద్ధి పనులు చేశారు. విద్యార్థులకు ఎన్నడూ లేని విధంగా తాగునీరు అందించేందుకు వాటర్ ప్యూరిఫైర్ రూ.5లక్షలతో ఏర్పాటు చేశారు. సొంత స్థలాలు ఉన్న వారికి 90 ఇళ్లు మంజూరు చేసి ఒకొక్కరికీ రూ.1.80 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు కలసి సుమారు రూ.కోటి పైనే అభివృద్ధి పనులు గ్రామంలో జరిగాయి. జలజీవన్ పథకంలో రూ.10లక్షలతో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారు. రూ.42లక్షలతో గ్రామ సచివాలయం ఏర్పాటు చేయడంతో గ్రామ సమస్యలన్నీ ఇంచుమించుగా ఇక్కడే పరిష్కారానికి నోచుకుంటున్నాయి. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రూ.20 లక్షలతో ఆర్‌బీకే నిర్మించడంతో వారి కష్టాలు తీరాయి.



మామిడిపల్లిలో గ్రామ సచివాలయం



రైతు భరోసా కేంద్రం



గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్డు

రాజన్నదొర సహకారంతోనే అభివృద్ధి

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాయి. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సహకారంతో పంచాయతీ అభివృద్ధి పథంలో నడుస్తోంది. రూ.కోట్లు సంక్షేమ పథకాల కింద ప్రజల్లో బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అయింది. గ్రామాభివృద్ధి కూడా జరిగింది.

– సువ్వాడ శశికళ, సర్పంచ్

ప్రతి ఇంటికీ సంక్షేమం

గడిచిన మూడేళ్లుగా కరోనాతో ఇబ్బందులు పడిన ప్రజలకు జగనన్న సంక్షేమ ఫలాలు అందాయి. పనుల్లేక పంటలు పండక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ప్రతి కుటుంబానికి రూ.వేలు అందాయి. అందువల్ల ప్రజలు సంతోషంగా ఉన్నారు. గ్రామంలో ఆర్‌బీకే, సచివాలయ నిర్మాణాలు జరగడంతో ఏ పని కావాలన్నా వలంటీర్ల సహకారంతో జరుగుతున్నాయి. వలంటీర్ల సేవలు అభినందనీయం

– పెద్దింటి మాధవరావు, పీఏసీఎస్ చైర్మన్

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

• ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పెదబొండపల్లి గ్రామ పంచాయతీ మూడడ్లవలస గ్రామంలో రూ.3లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శనివారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గల గ్రామాలు, వార్డుల్లో కూడా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన రోడ్డు సమస్య పనులను ప్రారంభించామన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు సీఎంగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సవరాపు రామారావు, ఎంపీటీసీ ఏగిరెడ్డి లక్ష్మీరమణ, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు చందాన శివాజీ, అల్లం వెంకటరావు, జేసీఎస్ కన్వీనర్ వాసుదేవరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సింహాచలం

పార్వతీపురం టౌన్: పట్టణ పారిశుద్ధ్యంలో కార్మికుల పాత్ర కీలకమని మున్సిపల్ కమిషనర్ పి.సింహాచలం అన్నారు. స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపాల్టీ పరిధిలో క్లాప్ వాహనాల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం చేపడుతున్నామని, క్రమం తప్పకుండా ఇంటింటి చెత్త సేకరణ ఇలానే కొనసాగించాలన్నారు. ముఖ్యంగా పట్టణంలోని డస్ట్‌బిన్లు ఉండే ప్రదేశంలో పారిశుద్ధ్యం మరింత మెరుగుపరచాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, జనావాస ప్రదేశాల్లో వ్యాధులు ప్రబలకుండా క్లోరిన్ పిచికారీ చేయాలని సూచించారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి వార్డులను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, సూపర్‌వైజర్లు సాయి, కుమార్, భాస్కరరావు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా 80 శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ సత్యనారాయణ

• డీపీఓ బలివాడ సత్యనారాయణ

పార్వతీపురం టౌన్: ఈ నెలాఖరులోగా 80 శాతం ఇంటి పన్ను వసూళ్లు పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీలతో ఆయన శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న భూహక్కు, భూ రక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ కంఠాల్లో ఉండే భూముల్లో ఉండే కట్టడాలకు శాశ్వత భూహక్కు కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రామాల్లో ఈ నెలాఖరులోగా 80 శాతం ఇంటి పన్ను వసూలు పూర్తి చేసి ఉప ఖజానాకు జమ చేసి వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను అన్ని శాఖల సమన్వయంతో రూపొందించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.26కోట్లు విడుదలైన కారణంగా ఇప్పటి వరకు రూ.10 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, మిగిలిన నిధులతో గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు, విద్యుత్ చార్జీలు, తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు గ్రామాల అభివృద్ధి చేసేందుకు ఖర్చు చేయాలని సూచించారు. గ్రామాల్లో వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ అధికారుల సమన్వయంతో పూర్తి ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ప్రభాకరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయికుమార్, డీఎల్‌పీఓలు రామప్రసాద్, నాగభూషణరావు, ఈఓపీఆర్‌డీలు, పంచాయత కార్యదర్శులు, మండల రిసోర్సుపర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీరు సరఫరా చేయాలి



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ హనుమంతరావు

సీతానగరం: మండలంలోని ప్రజలకు రానున్న వేసవిలో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసేందుకు ఇంజినీరింగ్ సహాయకులు, మెకానిక్‌లు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ పార్వతీపురం సబ్ డివిజన్ డీఈ హనుమంతరావు కోరారు. ఏఈఈ ఆర్.పవన్ కుమార్ అధ్యక్షతన బోర్ మెకానిక్‌లు, ఇంజినీరింగ్ సహాయకులకు స్వచ్ఛమైన నీటి సరఫరాకు అవసరమైన శిక్షణ శనివారం ఇచ్చారు. ఈ మేరకు డీఈ హనుమంతరావు మాట్లాడుతూ వివిధ పథకాల ద్వారా, సీపీఎస్‌డబ్ల్యూ, ఎంసీపీడబ్ల్యూ, జల్‌జీవన్ మిషన్ పథకాల ద్వారా గ్రామాల్లో తాగునీరు సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టడంతో పనులు పూర్తి కావచ్చాయన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇంటింటి కుళాయిలు, ఇతర మంచినీటి పథకాలు ద్వారా తాగునీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో 21 సచివాలయాల ఇంజినీరింగ్ సహాయకులు, పథకం మెకానిక్‌లు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతోనే విద్యుత్ సరఫరాకు అంతరాయం

మక్కువ: సాలూరు పట్టణంలోని 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో ఉన్నటువంటి 10/16 ఎంకేవీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కువ సామర్థ్యం కలిగిన 31.5 కేవీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌గా మార్చడం వల్ల రెండు రోజులు రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిందని విద్యుత్ శాఖ ఎస్‌ఈ లక్ష్మణరావు అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33/11 కేవీ మక్కువ పాచిపెంట విద్యుత్ ఉప కేంద్రాలలో అదనంగా 5 కేవీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు అయిందని వీటిని వచ్చే మార్చి నెలలో అందుబాటులోకి తీసుకొచ్చి మెరుగైన విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ పై అవగాహన

మక్కువ: మండలంలోని మునక్కాయవలస గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్‌లో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమంపై విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులను చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజుల వీణ, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ ఎం.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళిక

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర తెలిపారు. శనివా రం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికే పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధత చేశామన్నారు. విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తు న్నామని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ప్రస్తుతం పాఠ్యాంశాల రివిజన్ జరుగుతోందన్నారు. వచ్చేనెల 18 నుంచి జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సీతంపేట ఐటీడీఏ పరిధి లో 29 ఆశ్రమ పాఠశాలల నుంచి 484 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు

సీతానగరం: మండలంలోని వివిధ పద్దుల ద్వారా గ్రామ పంచాయతీలకు విడుదలైన నిధులతో జరుగుతున్న పనులు నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారి జి చంద్రమౌళి అన్నారు. గుచ్చిమి పంచాయతీలో జరుగుతున్న రిటైనింగ్ వాలు నిర్మాణం, నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను శనివారం పరిశీలించారు. పనులు పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ మండలంలోని రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన కోట్లాది రూపాయిల వ్యయంతో రిటైనింగ్ వాల్స్, సీసీ రోడ్లు, కాలువలు, సచివాలయాలు, రైతుభరోసా భవనాలు, వెల్‌నెస్ భవనాలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు, మరమ్మతులు జరుగుతున్నాయని వివరించారు. ఇప్పటికే సచివాలయ భవనాలు, ఆర్బీకే భవనాల పనులు పూర్తయి ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించినట్టు తెలిపారు. వివిధ స్థాయిల్లో ఉన్న మిగతా భవనాలు నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రారంభించడానికి సిద్ధం చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గుచ్చిమి మాజీ సర్పంచ్ ఎం.ధనంజయనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్ అప్పలనాయుడు, బి.శంకరరావు, బి.చిన్నంనాయుడు, ఇంజినీరింగ్ సహాయకులు, టెక్నికల్ సహాయకులు పాల్గొన్నారు.



గుచ్చిమి రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గిరిజన రైతులకు సాగుపట్టాలు



గిరిజనులకు సాగు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: గిరిజనుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం మండలం బుదురువాడ పంచాయతీలో గల గిరిజన రైతులకు సాగు పట్టాలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గల 11 పంచాయతీల గిరిజనులకు 57వేల ఎకరాల సాగు పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా భూ సర్వే నిర్వహించి కచ్చితమైన సరిహద్దుల్లో మ్యాపింగ్ చేసి పట్టాలను రైతన్నలకు ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు. డి.పట్టా భూములపై శాశ్వత భూహక్కు కల్పిస్తూ జిరాయితీ పట్టాలను సైతం ఇస్తూ గిరిజనులకు అండగా నిలుస్తున్నారన్నారు.

కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య సహాయకులకు సత్కారం

సీతానగరం: వివిధ హోదాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు అనివార్యమే అయినా విధుల్లో ఉన్న సమయంలో వారు అందించిన సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని సీతానగరం పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. సీతానగరం సబ్‌డివిజన్‌లో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో పశువైద్య సహాయకులుగా సేవలందించి ఇటీవల బదిలీపై వెళ్లిన వారికి బలిజిపేట,సీతానగరం మండల పశువైద్యాధికారులు ఎస్.రామారావు, జి.గణేష్ ఆధ్వర్యంలో జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో బలిజిపేట, సీతానగరం గ్రామీణ పశువైద్య కేంద్రాల పశువైద్యులు ఆర్బీకే పశువైద్య సహాయకులు, ఏడీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సన్మాన గ్రహీతలకు జ్ఞాపికలందజేస్తున్న డాక్టర్లు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: పట్టణంలో అక్కేనవీధి, శతపతివీధులకు చెందిన యర్ర అప్పలనాయుడు, మార్పిన పద్మలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3,74,000 చెక్కులను ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర చేతుల మీదుగా అందించారు. పద్మకు రూ.2,71,000, అప్పలనాయుడుకు రూ.1,03,000 చెక్కులను స్థానిక నాయకుల సమక్షంలో ఉప ముఖ్యమంత్రి శనివారం అందించారు. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా మార్ట్‌ల్లో హోల్‌సేల్ ధరలకే రిటైల్ విక్రయాలు

• జిల్లా ఇన్‌చార్జి పీడీ సత్యంనాయుడు

సీతానగరం:

జిల్లాలో డీఆర్‌డీఏ వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా మార్ట్‌ల్లో వెలుగు సభ్యులందరికీ హోల్‌సేల్ ధరలకే రిటైల్‌గా విక్రయించడం జరుగుతుందని సరుకులను కొనుగోలు చేసి సహచర సభ్యుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని ఇన్‌చార్జి పీడీ వై.సత్యంనాయుడు కోరారు. మండల వెలుగు సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం బెద్ది శ్రీరాములు ఆధ్వర్యంలో వీఓఏలతో శనివారం సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సత్యంనాయుడు మాట్లాడుతూ జిల్లాలోని అటవీ ఉత్పత్తులు పసుపు, చింతపండు, కొండచీపుర్లు సరసమైన ధరకు అందించడం జరుగుతుందన్నారు. మహిళా మార్టుల్లో నిత్యావసర సరుకులు హోల్‌సేల్ ధరకు రిటైల్‌గా విక్రయించడం జరుగుతుందని సంఘ సభ్యులు తమ అవసరాన్ని గుర్తించి ఎంత అవసరమో తెలియజేయాలని సూచించారు. ప్రస్తుతం కొమరాడ మండలంలో తయారు చేస్తున్న కొండచీపుర్లను ప్రదర్శించడం జరిగిందన్నారు. సమావేశంలో డీపీఎం ప్రవీణ్, అప్పారావు, చేయూత ఏపీఎం సతీష్, సీసీలు ఎంఎస్‌పీలు, వీఓఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ సత్యంనాయుడు